# అన్యాయము

శ్రీ తురగా శేషగిరిరావు

"ఏమమ్మా పిన్నీ! నీసంగతిచూస్తే నాకే మాత్రము బాగుండలేదు. నీవల్ల స్త్రీలోకాని కంతటికీ తలవంపులు కదమ్మా!"

"..............."

"ఎంతకని సహించను? ప్రతి అడ్డమైన గాడిద కొడుకు నీపిన్ని ఫలానాటి గదా! అని అడగడమేనా యెను! ఇన్ని సంవత్సరాలనుండి యీఊరిలో ఉంటున్నాము. ఎప్పుడైనా వేలుపెట్టి చూపించుకున్నామా? నీవల్ల మాకిప్పుడు తలకొట్టేసి నట్లయింది."

"చాలు లేవయ్యా! ఎవరో మతిలేని వెధవలు వాగారని నీవుకూడా యిట్లా మాట్లాడుతావే! నాలో ఏలోపం కనిపెట్టావు నీవు? ఆడదంటే ప్రతివాడికి లోకువయింది."

"ప్రతి దానికికో ఊతపదం దొరికింది. ఇప్పుడు నిన్నేం లోకువ కట్టేమమ్మా? ఇటువంటి పనులుచేస్తే, నీవంశానికి, మావంశానికి కూడా అప్రతిష్ట అని చెపుతున్నాను. అంతకన్నా ఏమిలేదు."

"అవునులే. మీవంశము చాలా గొప్పది. మా సాంప్రదాయము చాలా చెడ్డది...ఆసంగతి తెలిసి కూడా, మీనాన్నగారు, తిరిగి పెళ్లి ఎందుకు చేసుకున్నారో కనుక్కో."

"అయితే తిరిగి రెండవపెళ్ళి చేసుకున్నందుకు నీవు విధించిన జుల్మానా యిదా? చాలా బాగుంది,.. నీసంగతి తెలుసుండికూడా నీతో మాట్లాడడం నాదే తప్పు"

"తీగెలాగుతే డొంక కదులుతుంది నాసంగతి నీకేమి తెలిసింది?"

"ఇంకా ఏమితెలియాలి? భోధపడవలసినదంతా భోధపడింది. ఊరంతా మన విషయమే చెప్పుకుంటున్నారు. పిల్లి కళ్లుమూసుకొని పాలుత్రాగుతూ ఎవరూ చూడలేదనుకుంటుంది. ఫలానా వకీలుగారి భార్య యిట్లాంటిదని అంటే మాకెంత తలవంపులు?"

"ఏమోయ్! విశ్వనాథం. నేవొకటే మాట చెబుతున్నాను. ఈసామెతలు గీమెతలు నాదగ్గర పనికిరావు. నీకేమైనా, నామీద అనుమానంగా ఉంటే, ఋజువుచేసి, నీయిష్టమొచ్చినట్లను. అప్పుడు పడతాను గాని యిట్లా మాట్లాడితే నేనెంతమాత్రము ఓర్చుకోను తెలిసిందా?"

"సరే. నీకు ఋజువుచెయ్యాలి కదూ!"

♦ ♦ ♦

"మనమెంత గుట్టుగా వుంటున్నా మనుకున్నా సంగతంతా అందరికి తెలిసిపోయింది."

"ఏం జరిగిందేమిటి?"

"నిన్న విశ్వనాథం నానామాటలు అని కడిగి విడిచి పెట్టాడు. దీనికేదైనా ఉపాయం ఆలోచిస్తేనే గాని లాభం లేదు."

"ఆ! ఆసన్యాసి నిన్నేంజేస్తాడులే!"

"అతడు చేస్తాడని కాదు. తండ్రితో చెప్పాడంటే నీకూ, నాకూ కూడా పుట్టి మునుగుతుంది. నీకు ఉద్యోగంలోనుంచి బర్తరఫు. నాకు నానాయాతనలు. ఇంతకన్నా యింకేమికావాలి?"

"..............."

"నీవట్లా మాట్లాడకుండా కూర్చుంటే ఎట్లా చెప్పు?"

"ఏదోఒకటి తేల్చెయ్యాలిసిందే."

"ఏం తేల్చమంటావు? ఎక్కడికైనా వెళ్ళిపోదా మనుకున్నా, తరువాత గడిచే ఉపాయం చూచుకోవద్దా?"

"అట్లా అయితే మన సంబంధం విడి పోవాల్సిందేనా?"

"అట్లా ఎప్పుడనుకోకు. మృత్యువు తప్ప మనల్ని యింకొకటి విడతియ్యలేదు తెల్సిందా!"

"ఈకబుర్లకేమిలే! ఏదోఒక మార్గం ఆలోచిస్తేనేగాని, యీ యింట్లో మునపటిలాగు జరగడానికి వీలుండదు. ఇంతవరకు చలీచీమకు కూడా తెలియకుండా గడిపాము. మధ్యలో యీవిశ్వనాథంగాడు సైంధవుడిలాగు అడ్డము వచ్చాడు. గదా!"

"ఇంత మాత్రానికే భయపడితే ఎట్లా?"

"..............."

"..............."

"..............."

"ఏమమ్మా పిన్నీ! నిన్న ఋజువు కావాలంటివే? ఇప్పుడు దీనికేమి చెబుతావు. నేనెంతమాత్రము కనుక్కోలేననుకున్నావు కాబోలు...సరే! దీనికి తగిన మందు ఆలోచించాలి. లేకపోతే యీ జబ్బు ముదిరిపోతుంది...బ్రహ్మానందంగారూ! తమవంటి పెద్ద మనుష్యుల కింక చెప్పేదేముంది?"

♦ ♦ ♦

"ఏమిటే! ఇవాళ యిట్లావున్నావు? ఒంట్లో ఖులాసాగా లేదా? ఏమిటి? డాక్టరు బాబుకు కబురు పంపనా?"

"................"

"ఏసంగతి చెప్పకపోతే ఎట్లా తెలుసుకునేది?"

"................"

"ప్రొద్దున కోర్టుకు వెళ్లేటప్పుడే కొద్దిగా మందగొండిగా ఉన్నావు. అప్పుడే చెబితే మంచి చెడ్డలు ఆలోచించే వాళ్ళముగా"

"................"

"బాగానే ఉంది, సరసం! చెప్పకపోతే ఎట్లా మరి?"




# బహుమానం రు 550

## సిద్ వశీకరణ కవచము

ఎవరైనా ఆడదిగాని మొగవాడు గాని నీతో విరోధంగాను యింకా వేరేవిధంగా వున్నాసరే యిది ధరిస్తే నీకు వశులవుతారు నిన్ను బాగా ప్రేమిస్తారు. రాగితాయిత్తు వెల రు. 1-15-0. 3 ఒకేసారి తెప్పించినవారికి రు. 5-0-0. వెండి తాయిత్తు రు. 2-12-0. బంగారపు తాయిత్తు రు. 6-8-0.

లక్ష్మి యంత్రం: ఈయంత్రం, వ్యాపారం, లాటరీ, పరీక్షలు, కుస్తీలో విజయంకల్గించును. ధనవంతులను ఆరోగ్యవంతులను చేయును. బిడ్డల కావలసినవారు రెండు యంత్రములను కొనాలి. ఒకటి మగవారికి యింకొకటి ఆడదానికి. రాగికేసు రు. 1-15-0, 3 యంత్రాలు రు. 5. వెండికేసు రు. 2-12-0. గోల్డుకేసు రు. 6-8-0. నాలుగు వుద్దేశాల పొందాలంటే స్పెషల్ పవర్ ఫుల్ నెం. 4 అడగండి వెల రు. 5-4-0. 5 కంటె ఎక్కువ ఫలితాలు కావాలంటే నెం. 5 వెల రు. 7-8-0 కు అడగండి. పోస్టేజి ప్రతికేసుకు ప్రత్యేకం:

గమనిక: ఫలించలేదని రుజువుచేయువారికి రు. 550 లు బహుమానమివ్వబడును: డబ్బు వాపసుచేయబడును. ఇది ఫలవంతం కాడానికి కఠినమైన నిబంధనలు ఏమీలేవు.

**ANAND SWAMI,**

**ANAND BHAWAN, POST BOX NO. 27 (K.M) AMRITSAR.**

"ఎందు కేమిటి, చెప్పడం? మహా చేసినట్లు మాట్లాడుతారు. తియ్యనిమాటలు ఎన్నైనా చెప్ప గలరు. క్రియమాత్రము శూన్యము."

"ఏదో పెద్ద గ్రంథమేయుంది. మమ్మల్ని చంపక సంగతేమిటో త్వరగా తేల్చు"

"ఔను. మీలోకువ కనిపెట్టే, అతనట్లా మాట్లాడ గలిగాడు. లేకపోతే ఎన్నిగుండెల్తో మాట్లాడుతాడు?"

"ఎవరూ?"

"మొగుడు 'ముండా' అంటే బిచ్చగాడు 'ముండా' అన్నాడట. అట్లాఉంది. మన బంగారము మంచిదయితే కంసాలి ఏంచేస్తాడు? ఎవర్నంటే ఏమి ప్రయోజనం? ఇదంతా నాప్రారబ్ధము. ఈ కాలంలో రెండోవపెళ్ళి పెండ్లామంటేనే లోకువ. మేమెంత భర్తను దైవంగా ఎంచి పూజించినా సరే!"

"అసలు సంగతేమిటో చెప్పకుండా ఉపన్యాసము ప్రారంభిస్తే ఎట్లా? ఇప్పుడు [illegible] నే నేమిలోటు చేశాను?"

"మీరు లోటుచేసినా సర్దుకు పోతాను. మీ కన్ని అన్నా పడతాను. పడవలసిన బాధ్యత ఉంది ...గాని అతనట్లా యిష్టమొచ్చినట్లు 'సవతితల్లి' గదా అని మాట్లాడుతే ఎట్లా? మీరు చూస్తూ ఊరుకోబట్టే గదా చెల్లిస్తుంది. తనకన్నా చిన్నదానినైనా, పిన్ని అనే గౌరవము అయినా ఉంచవద్దూ? నోటికి ఎంత మాటవస్తే అంతమాట అనడమే నా?"

"ఏమన్నా డేమిటి?"

"నిన్న మన ప్రెస్ మేనేజరు బ్రహ్మానందంగారు మీతో మాట్లాడి పోదామని వచ్చారు. మీ ట్లోలేరని చెప్పాను. పంతులుగారు రాగానే నేనువచ్చి వెళ్ళానని చెప్పండి. వారితో అవసరమైన విషయాలు మాట్లాడాలి అని చెప్పి వెళ్ళబోతున్నాడు."

"సరే! దీనిలో తప్పేముంది?"

"ఇంతలో విశ్వనాథంవచ్చి నోటికి వచ్చినట్లు మాట్లాడడం మొదలు పెట్టాడు."

"ఏమన్నా డేమిటి?"

"నన్నుగురించి లోకులు 'మంచిదిగాదని' చెప్పుకుంటున్నారుట. ముసలి భర్తనుచేసి మిమ్మల్ని ఆడిస్తున్నానుట...ఇంకా పైగా బ్రహ్మానందంగారికి నాకు సంబంధముందిట. నేను సిఫార్సుచేస్తేనే అతనికి మీరు 'ప్రెస్ మేనేజరు' పని యిచ్చారట. ఇంకా యిట్లాగే ప్రేలాడు."

"చాలావరకు వచ్చిందే! వెధవను రానీ చెప్తాను. నోటికి ఎంతమాటవస్తే అంతా అనెయ్యడమే!"

"నామీద తనకేమైనా అనుమానంగా వుంటే మీతో చెప్పి, తప్పుంటే శిక్షించేటట్లు చెయ్యాలిగాని తనకేమి అధికారముంది యిట్లా మాట్లాడడానికి? పాపం! ఆ బ్రహ్మానందంగారు సజ్జనుడుగను కను, మీ మొఖంచూచి వూరుకున్నాడుగాని యింకొకడైతే ఎంతగ్రంథము జరిగేదో...అదంతా నాకెందుకు? ఈ యింట్లో అతనైనా ఉండాలి, లేకపోతే నేనైనా ఉండాలి. ఇద్దరూ వుండడం మాత్రం వీలుపడదు."

"..............."

"..............."

"..............."

"ఏమోయ్! విస్సూ! ఇట్లారా. పిట్ట కొంచెం కూత ఘనమున్నా, నీకు ఎన్నిసార్లు చెప్పాలి."

"మీపిన్ని విషయంలో జోక్యం కలుగ చేసుకోవద్దని?"

"..............."

"చిన్నా పెద్ద లేకుండా, ఇష్టమొచ్చినట్లు ప్రేలడమేనా? నీపని నీవు చూచుకోక, యితర వాటితో, జోక్యమెందుకు పెట్టుకుంటావు?"

"కాదండీ! నాన్నగారూ నేను ప్రత్యక్షముగా చూచిన తరువాతనే, ఇట్లా ప్రవర్తించి అమర్యాద తేవద్దని చెప్పాను. అంతేగాని..."

"చాలులే! నోరుమూసుకో! మీకాలేజిలో నుంచి ట్రాన్సఫర్ సర్టిఫికేట్ (టి. సి.) తెచ్చుకొని, విశాఖపట్నంలో మీ మేనమామ దగ్గరఉండి, చదువుకుంటే చదువుకో, లేకపోతే నీయిష్టమొచ్చినట్లువెళ్లు. నీసంగతే తలపెట్టను. విశాఖపట్నం వెళ్ళదల్చుకుంటే రేపే ప్రయాణానికి సిద్ధపడు...అంటూ విశ్వనాథం తండ్రికోపంతో లోపలికి వెళ్ళిపోయాడు."

"ప్రక్కయింటి డాబామీద, గ్రామఫోను."

"ఎంత నేర్చినా, ఎంత తెలిసినా, ఎంతవారలైనా కాంతదాసులే..."

"అనే త్యాగరాజ కీర్తనను, విశాల ప్రపంచములోకి విసురుతోంది."